క్లుప్తంగా

పెన్షన్ సౌకర్యం కల్పించాలి

ఇల్లెందురూరల్: 1999 నుంచి 2004లో విద్యుత్ సంస్థలలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఒకే శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేర్వేరు సౌకర్యాలు కల్పించడం అన్యాయమన్నారు. తమ సేవలను గుర్తించి పెన్షన్ వర్తించేలా సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ముఖ్యమంత్రికి వివరించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏడీఏ కోటేశ్వరరావు, ఏఈ సుధాకర్, మోహన్‌రావు, రామకృష్ణ, వెంకటరాజు, రాజేష్, చలమయ్య పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: టీయూసీఐ రాష్ట్ర మహాసభ పోస్టర్లను గురువారం ఇల్లెందులోని ఎల్లన్న భవన్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిజామాబాద్‌లో జరగనున్న ప్రథమ మహాసభ విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. గురువారం ఇల్లెందులో పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండు రోజులు జరగనున్న మహాసభలకు జిల్లా నుంచి అత్యధికంగా తరలివెళ్లాలని కార్మికులను కోరారు. పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, గురునాథం పాల్గొన్నారు.

ఓసీ ఉద్యోగులకు క్విజ్ పోటీలు

టేకులపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్విరాన్‌మెంట్ వీక్‌లో భాగంగా గురువారం ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం.. అనే అంశంపై కోయగూడెం ఓసీలో కార్మికులకు అవగాహన కార్యక్రమం, ఉద్యోగులకు క్విజ్ తదితర ఆటపోటీలను నిర్వహించారు. అడిషనల్ మేనేజర్ (సేఫ్టీ ఆఫీసర్) బ్రహ్మం విజేతలు... రవికుమార్, కే.నరసింహారావు, నాగశేషు, ఆర్.అశోక్, సర్వర్, సత్యనారాయణ, సిరిమల్లె అశోక్‌లకు బహుమతులు అందజేశారు.

ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

టేకులపల్లి: ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 2025 విద్యా సంస్థల ప్రారంభం అయిన సందర్భంగా ప్రైవేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, యూనిఫామ్, బుక్స్, నోట్ బుక్స్, బెల్టు, టై ఇంకా అనేక పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ప్రైవేటు స్కూళ్లను తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న స్కూళ్ల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు స్టాండ్ల వితరణ

సింగరేణి(కొత్తగూడెం): ఎండనక, వాననక వీధి వ్యాపారులు పడుతున్న బాధను గమనించిన కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కుమారుడు ఎం.జోనివిన్సెంట్, అతని సతీమణి షకీనా మ్యాథ్యూస్ దంపతులు వారి కుమార్తె ఐరా పేరు మీద గురువారం వారికి స్టాండ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

ఇల్లెందురూరల్: ధరణి కారణంగా భూసమస్యలకు పరిష్కారం లభించక ఇంతకాలం ఇబ్బంది పడిన రైతులకు భూభారతితో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు అన్నారు. కొమరారం, పోచారం తండా గ్రామాలలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణిలో ఉన్న లోపభూయిష్ట నిబంధనల కారణంగా మండలంలో చాలామంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్నా కాస్తు కాలం తొలగించడం వల్ల అనర్హులుగా చిత్రీకరించబడ్డారని వాపోయారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు.

జూలూరుపాడు: భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. గురువారం భోజ్యా తండాలో తహసీల్దార్ టి.శ్రీనివాస్, వెంగన్నపాలెంలో ఆర్ఐ సీహెచ్ ఆదినారాయణ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మాట్లాడుతూ... భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 20వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోరు ఏర్పాటు

టేకులపల్లి: చింతోని చెలక గ్రామ పంచాయతీ వజ్జానిగూడెం హ్యాబిటేషన్‌లోని గొత్తికోయ గ్రామం సర్వన్ బోడులో తీవ్ర నీటి సమస్య ఉంది. కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ అధికారి జేఎల్ గణేష్ గాంధీ ఆధ్వర్యంలో గురువారం అధికారుల పర్యవేక్షణలో బోర్ వేయించి హ్యాండ్ పంప్ బిగించారు. గొత్తికోయలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ స్కూళ్లను ఆదరించండి..



ఇల్లెందురూరల్: తొలి రోజే క్యూకట్టి ముత్తారపుకట్ట పాఠశాలకు చేరుకుంటున్న చిన్నారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎం డాక్టర్ ప్రభుదయాళ్ పేరెంట్స్ సమావేశం నిర్వహించి పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ పిల్లల చదువు విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు.

జూలూరుపాడు: వేసవి సెలవుల అనంతరం గురువారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభమయ్యాయి. పలు పాఠశాలలను మామిడి తోరణాలతో అలకరించి, పండుగ వాతావరణాన్ని కల్పించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల స్కూల్ యూనిఫామ్‌ను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అందజేశారు. తొలి రోజే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని అందించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగు నీరు, పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయడం వంటి కార్యక్రమాలను పాఠశాలల పునఃప్రారంభం రోజు కంటే ముందే రోజు పూర్తి చేశారు.

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. కొమ్ముగూడెంలో పీసీ చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయులు మాధావరావు, బిక్కుతండా, పాండురంగాపురం, కొత్తసూరారంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు దుస్తులతోపాటు పాఠ్యపుస్తకాలను అందజేశారు.



సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందస్తున్న హెచ్ఎం

పాఠశాలలకు చేరుకోని విద్యార్థులు..

ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజు విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగా ఉంది. గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఆశ్రమ పాఠశాలలకు, హాస్టళ్లకు విద్యార్థులు తొలిరోజు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. మండలంలోని పాఠశాలలకు ఉపాధ్యాయులు తోరణాలు కట్టించి విద్యార్థులకు స్వాగతం పలికారు. మండలంలో 40 నుంచి 50 శాతం మాత్రమే విద్యార్థులు తొలిరోజు హాజరైనట్లు ఎంఈఓ శ్రీరామ్మూర్తి తెలిపారు.

మధ్యాహ్న భోజనాలు పరిశీలన..

గురువారం యానంబైల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలనతోపాటు, ఆయుష్మాన్ ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ కె.విజయభాస్కర్ రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. యానంబైల్ హైస్కూల్ పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను హెచ్ఎం ప్రకాశ్ రావు, ఉపాధ్యాయులను అభినందించారు.

ఇల్లెందు: వేసవి సెలవులు ముగించుకుని గురువారం తొలిబడి గంట మోగింది. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నిర్ణీత సమయానికి బడి గంట మోగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు.

ఇల్లెందురూరల్: అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మహిళా సంఘాలను, వివిధ ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట పాఠశాలల్లో మరమ్మత్తులు చేయించిందని గుర్తుచేశారు. తద్వారా పాఠశాలలు అందంగా తీర్చిదిద్దబడ్డాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై బాగా చదువుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఎంఈఓ ఉమాశంకర్, ఏపీఎం దుర్గారావు, సీసీ సంపత్, రాము మహేష్, ఏఎంసీ డైరెక్టర్ రాము, ఊరకొండ ధనుంజయ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సందడి..

వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజే విద్యార్థులు హుషారుగా పాఠశాలకు చేరుకోవడంతో పలు పాఠశాలల్లో సందడి నెలకొంది. వారం రోజులపాటు నిర్వహించిన బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు నడిపించడంలో ఉపాధ్యాయలు సఫలీకృతులయ్యారు. పలు గ్రామాలలో విద్యార్థులను సైతం భాగస్వాములను చేయడంతో కొన్ని పాఠశాలల్లో తొలి రోజే అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

అమ్మ ఒడి లాంటిది.. అంగన్‌వాడీ బడి

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మ ఒడి లాంటివని ఐదేళ్ల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి, బోడు, సులానగర్, బొమ్మనపల్లి, గంగారం సెక్టార్లలో సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో సీడీపీఓ పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకుంటామని, ఐదేళ్లు నిండిన పిల్లలను గవర్నమెంట్ స్కూల్లో చేర్పిస్తామని తెలిపారు. సూపర్‌వైజర్లు అనురాధ, ఖలీదా, లక్ష్మి, యశోదమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందు: జేబీఎస్ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



జూలూరుపాడు హైస్కూల్‌లో...



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ హైస్కూల్‌లో..



పాల్వంచరూరల్: కొత్తసూరారంలో..



టేకులపల్లి: గంగారం సెక్టార్ కిష్టారం అంగన్‌వాడీలో

'ప్రియదర్శిని'కి బంగారు పతకాలు

కొత్తగూడెంఅర్బన్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం సందర్భంగా ప్రకటించిన బంగారు పతకాలలో స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలకు నాలుగు వచ్చినట్టు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 7న యూనివర్సిటీ ఆడిటోరియంలో గవర్నర్ పతకాలు ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శులకు సన్మానం



దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: నూతనంగా పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన నల్లపు దుర్గాప్రసాద్, మోతుకూరి ధర్మారావు, నాగ సీతారాములను గురువారం కొత్తగూడెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. జేబీ శౌరి, ఏలూరు కోటేశ్వరరావు, గద్దం రాజశేఖర్, అజ్మీర సురేష్ నాయక్, మహమ్మద్ గౌస్, తంగేళ్ల లక్ష్మణ్, పల్లపు లక్ష్మణ్, కసనబోయిన భద్రం, జయప్రకాష్, ఉస్మాన్ అలీ, ఎస్కే నయీమ్, మంద సాయి పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 13న కొత్తగూడెంలోని బాబుక్యాంపులోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, క్విక్ సర్వీస్ రెస్టారెంట్, ఫుడ్ అండ్ బేవరేజ్ స్టెవార్డ్, రిటైల్ సేల్స్ అసోసియేట్‌లలో 100 పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి..

టేకులపల్లి: వానాకాలం సాగు చేస్తున్న రైతుల సమస్యలు పరిష్కరించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ సంవత్సరం రాష్ట్రంలో వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, పాత రుణాలు మాఫీ చేయాలని, రైతు భరోసా, కౌలు రైతులకు పోడు భూములకు కూడా వెంటనే చెల్లించాలని కోరారు. సన్న ధాన్యం బోనస్ వెంటనే చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరలు ప్రకటించాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని కోరారు. కార్యదర్శి పంతులు, లింగ, జరుపుల సుందర్, ఏసుటి నాగయ్య పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలపై చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారావు

జూలూరుపాడు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని కొత్తగూడెం ఏడీఏ యు.నరసింహారావు హెచ్చరించారు. గురువారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జూలూరుపాడు వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విత్తన, ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో రైతు పేరు, సెల్ నంబర్, ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నాడో వివరాలు నమోదు చేసుకోవడంతోపాటు, సంతకాలు తీసుకొని రసీదులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. విత్తనం పేరు, బ్యాచ్ నంబర్, మ్యానుఫ్యాక్చరింగ్ నంబర్‌తో సహా రైతుకు ఇచ్చే రసీదులో నమోదు చేయాలని వ్యాపారులకు ఆయన సూచించారు. దుకాణంలోని స్టాక్ బోర్డుపై స్టాక్ వివరాలు, రిజిష్టర్లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. రైతులు తప్పని సరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ విత్తనాలు అమ్మేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ లూజు విత్తనాలు ఎవరైనా అమ్ముతున్న విషయం తెలిస్తే పోలీసులకు వ్యాపారులు సమాచారం ఇవ్వాలని సూచించారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్, ఏఈఓలు బి.గోపీకృష్ణ, గౌస్, ప్రసాద్, విజయభాను, డీలర్ల అసోసియేషన్ నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మంగమూడి నాగేశ్వరరావు, ఆళ్ల మధు బాబు, బాదావత్ బాలాజీ, అడపా సురేష్, డి.నాగేశ్వరరావు, ఎండపల్లి సీతారాములు, నరేష్, శివ, బి.బాలాజీ, కల్యాణపు గిరధర్, వందనపు కమలాకర్, నున్నా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి

ఇల్లెందు: కుటుంబ ఆర్థిక వ్యవస్థ సరిగా లేని కుటుంబాల్లో పిల్లలను బడిలో కాకుండా పనిలో పెడుతున్నారని, ఇలా చిన్నారులు చదువుకు దూరమై బాలకార్మికులుగా మిగిలిపోతున్నారని, ఇక మీదట పనిలో కాదు.. బడిలో ఉండేలా తల్లిదండ్రుల్లో చైతన్యం రావాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి సూచించారు. గురువారం ఇల్లెందు కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోస్టర్ రికార్డుల పరిశీలన

ఇల్లెందు: ఏరియాలో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగుల రోస్టర్ రికార్డులను చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ జీఎం వి.కృష్ణయ్య పరిశీలించారు. గురువారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, భాస్కరరావు, బ్రహ్మంలతో కలిసి రికార్డులను పరిశీలించారు. డీజీఎం పర్సనల్ తుకారాం, జీవీ మోహన్‌రావు, ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, రత్నం, వెంకటేశం, ఉద్యోగుల ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డుల్లో పండుగ సందడి..



ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: పేదల సొంతింటి కల నెరవేబోతోంది. గురువారం పట్టణంలోని 1 నుంచి 24 వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులు, నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ వార్డులో ఎమ్మెల్యే రాక సందర్భంగా అక్కడి నాయకులు, లబ్ధిదారులు పండుగ సందడి సృష్టించారు. తోరణాలు కట్టి, రోడ్ల మీద ముగ్గులు వేసి స్వాగత బ్యానర్లు కట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు సాధ్యం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, డీఈ మురళీ, ఏఈ నవీన్, హౌసింగ్ డీఈ వి.సుబ్రమణ్యం, ఏఈ స్వాతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, డీవీ, సయ్యద్ జానీపాషా, డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి క్యాంపు ఆఫీస్‌లో 18 మంది లబ్ధిదారులకు రూ.6.93 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, చీకటి కార్తీక్, తోట దేవీప్రసన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అందించడంలో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎంతోమంది సకాలంలో చికిత్స పొందలేక ప్రైవేట్ ఆస్పత్రిలలో అప్పులు చేసి, ఖర్చు పెట్టుకున్న బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా ఉంటుందన్నారు. బాలినేని నాగేశ్వరావు, మండే వీర హనుమంతరావు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, తలుగు అనిల్, మాధవరావు, హైమావతి పాల్గొన్నారు.

మళ్లీ ఇన్సులిన్ కొరత..



మందుల వివరాలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వ దవాఖానాలో ఇన్సులిన్ కొరత ఏర్పడింది. రెండు నెలలుగా ఇన్సులిన్ అందుబాటులో లేక షుగర్ వ్యాధి బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై వైద్యుల దృష్టికి వచ్చినా పైనుంచి స్టాక్ లేదని సమాధానం చెబుతున్నారు. ఇక డయాలసిస్ రోగులు అయితే తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా పీహెచ్‌సీలో పలురకాల మందుల కొరత తీవ్రంగా ఉందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సబ్ సెంటర్‌లలో రకరకాల మందులు అందుబాటులో ఉండాలని అధికారులు సూచిస్తున్నా ఏ సెంటర్‌లోనూ మందులు లేక రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇల్లెందు ఏరియా ఆస్పత్రిని సందర్శించి పరిశీలించగా చాలా రకాల మందులు అందుబాటులో లేవని తమ పరిశీలనలో తేలిందని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మోహన్‌రావు, మాదారపు వెంకటేశ్వర్లు, కొడెం బోస్, వజ్జా సురేష్ ఉన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో మందుల కొరత

- రెండు నెలలుగా స్పందించని యాజమాన్యం
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు, కుటుంబ సభ్యులు



సింగరేణి ప్రధానాస్పత్రి ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆస్పత్రుల్లో రెండు నెలలుగా మందుల కొరత వెంటాడుతోంది. సంస్థలో పనిచేసే కార్మికులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏడు ఏరియా ఆస్పత్రులతోపాటు, సింగరేణి వ్యాప్తంగా మరో 21 డిస్పెన్సరీలకు రూ.కోట్లు వెచ్చించి ఆస్పత్రులను కట్టించి వైద్యులను, సిబ్బందిని సమకూర్చింది. కానీ వైద్యం సరిగా అందకున్నా, మందులు లేకున్నా అధికారులు, సిబ్బందిలో చలనం లేదని కార్మికులు వాపోతున్నారు. ప్రధానంగా కార్మికులకు ప్రతీనెల బీపీ షుగర్, డయాబెటిస్, జ్వరానికి సంబంధించిన టాబ్లెట్లు, ఇంజెక్షన్లు లేవని, ప్రతీనెల కార్మికులకు ఇచ్చే టాబ్లెట్లు సైతం నెల రోజులకు స్టాక్ లేదంటూ 10, 15 రోజులకు మాత్రమే ఇస్తుండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మెరుగైన వైద్యంకోసం కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లిన కార్మికులకు అక్కడి వైద్యులు రాసిన మందులు పూర్తిగా లేవని, మరికొన్ని మందులు అసలే లేవని, బయట కొనుక్కోవాలని సిబ్బంది పేర్కొంటున్నారని కార్మికులు వాపోతున్నారు.

సంవత్సరానికి వైద్యానికే రూ.400 కోట్లు..

సింగరేణి సంస్థలో ప్రస్తుతం పనిచేస్తున్న 40 వేల మంది కార్మికులు, సుమారు 30వేల మంది రిటైర్మెంట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఆరోగ్య పరిరక్షణ కోసం సంవత్సరానికి సుమారు రూ.400 కోట్లు యాజమాన్యం ఖర్చు చేస్తోందని, వాటిలో మందులు, ఇంజక్షన్లకు సుమారు రూ.100 కోట్లు వివిధ కంపెనీల నుంచి తెప్పిస్తుంది. అయితే నెలకు ఏ మందులు కార్మికులకు ఇస్తున్నాము. ఆరుమాసాలకు ఏ మందులు ఎన్ని అవసరమో పార్మసీ సిబ్బందికి ఆడిట్, అకౌంట్ విభాగానికి ఓ లెక్క ఉంటుంది. అయితే పర్చేజ్ ఆర్డర్ ప్రకారం ప్రతీ మూడు నెలలకా.. ఆరు నెలలకా అని మందులు ఆర్డర్ చేయాల్సి ఉంది. మరి ఆర్డర్ పెట్టాల్సిన సిబ్బంది నిర్లక్ష్యమా... అడ్మినిస్ట్రేషన్ అధికారుల అలసత్వం, లేదా కార్పొరేట్ స్థాయి ఉన్నతాధికారుల నిర్లక్ష్యమో కానీ రెండు నెలలుగా మందులు లేక కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.

ఆస్పత్రి ఎదుట ధర్నా...

గతంలో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఉన్న సమయంలో యాజమాన్యంతో ప్రతీ విషయంలో ఆందోళన చేసి, నిలదీసిన ఏఐటీయూసీ నాయకులు రెండు నెలలుగా మందులు లేకపోతే నిలదీయాల్సిన సంఘం ఇటీవల సింగరేణి ఆస్పత్రి ఎదుట ఆందోళన చేయటం గమనార్హం. ఈ ఆందోళన వీరి ఉనికి కోసం చేశారా.. లేక మందులు లేవని కార్మికులకు తెలియజేస్తున్నారా అని కార్మికులు చర్చించుకుంటున్నారు. రెండు నెలల క్రితం సీఎండీ స్థాయి, డైరెక్టర్(పా) స్థాయి, కార్పొరేట్ స్థాయి, ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశంలో వీరు యాజమాన్యాన్ని ఎందుకు నిలదీయలేక పోయారో అర్థం కాని భేతాళ ప్రశ్న.

బీఓడీ మీటింగ్‌లో చర్చిస్తాం..



కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలతోపాటు ఈనెల 19న, జరిగే బీఓడీ సమావేశంలో సీఎండీతో చర్చించి భవిష్యత్‌లో ఈ పరిస్థితి రాకుండా చూస్తాము. కార్మికులు సమన్వయంతో ఉండాలి.
– రాజ్‌కుమార్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

సమయానికి ఆర్డర్ పెట్టాలి..



ప్రధానాస్పత్రికి రోజుకు 300 ఓపీ పేషంట్లు, సుమారు 100 మందికి పైగా ఇన్‌పేషంట్లు, రిటైర్డ్ కార్మికులకు బీపీ, షుగర్ మందులు నిత్యం వందల మందికి అవసరం. ఈ ప్రక్రియలో ఎన్ని మందులు అవసరం ఉంటాయో దాని ప్రకారం ఆర్డర్ పెట్టాలి.
– విజయగిరి శ్రీనివాస్, సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి

గుర్తింపు సంఘం విఫలం..



ఎన్నికల సమయంలో కార్మికులకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీల వర్షం కురిపించి కార్మికులను మోసం చేసి పదవి చేపట్టారు. కార్మికులకు వైద్యం, మందులు అందటం లేదని, తాము నిరసన దీక్ష చేపట్టేవరకు గుర్తింపు సంఘానికి సోయి లేదు. – కాపు కృష్ణ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

పాల్వంచరూరల్: ప్రజాపాలన అంటూ ప్రజలపై భారం మోపుతున్నారని పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం 20శాతం బస్‌పాస్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి పురుషుల దగ్గర డబుల్ చార్జీలను వసూలు చేయడం దారుణం అన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. తులసీరామ్, చిటికన మునలయ్య, కె.సత్య, మాధవి, నారాయణ పాల్గొన్నారు.